



వరి నాట్లు.. యంత్రంతో ఫాస్ట్



చేర్యాల ప్రాంతంలో పలువురు రైతులు వరి నాట్లను యంత్రంతో వేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఒకరు యంత్రాన్ని తీసుకువచ్చి ఒక ఎకరా పొలంలో నాట్లు వేయడానికి రూ.4,500 చొప్పున అద్దె తీసుకుంటున్నాడు. ముందస్తుగా యంత్ర నిర్వహకుడే నారు అలుకుడు చేసి ఒకే వ్యక్తి సహాయంతో నాట్లు వేస్తున్నాడు. సాధారణంగా 14 మంది కూలీలు రోజంతా ఆరు ఎకరాల్లో నాట్లు వేస్తారు. కానీ ఈ యంత్ర సహాయంతో రోజుకు 6-8 ఎకరాలలో నాట్లు వేయడంతో పాటు ఇద్దరు పనివారు సరిపోతారు. వర్షాలు లేక ఇప్పుడిప్పుడే నాట్లు వేస్తున్న క్రమంలో వ్యయం, సమయం ఆదా అవుతుండటంతో చేర్యాల ప్రాంతంలో ఇటీవలి రోజులలో వంద మంది వరకు రైతుల ఈ యంత్ర సహాయంతో నాట్లు వేయించారు.

- చేర్యాల, జూలై 13 (ఆంధ్రజ్యోతి)



బెజ్జంకి మండలం లక్ష్మీపూర్‌లో బోనాలను ఊరేగింపుగా తీసుకెళ్తున్న మహిళలు

అమ్మను తలిచి.. బోనం నివేదించి

దౌల్తాబాద్/రాయపోల్/బెజ్జంకి/కొండపాక/కోహెడ, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : ఆషాఢమాస ఆదివారాన్ని పురస్కరించుకుని జిల్లాలో గ్రామదేవతల ఆలయాలు కిటకిటలాడాయి. అమ్మవార్లకు భక్తులు బోనం నివేదించి మొక్కలను చెల్లించుకున్నారు. దౌల్తాబాద్ మండలం అప్పాయిపల్లిలో మహంకాలమ్మ, పోచమ్మతల్లికి గౌరైపాటిల్ బండితో ఊరేగింపు ఆకట్టుకున్నది. రాయపోల్ మండలం బేగంపేటలో మహంకాళమ్మ ఉత్సవాల్లో భాగంగా ఎడ్లబండ్లను ఆలయం చుట్టూ తిప్పారు. కొండపాక మండలం బందారంలో రెడ్డి సంఘం ఆధ్వర్యంలో, బెజ్జంకిలో ముదిరాజ్ సంఘం, మండలంలోని లక్ష్మీపూర్‌లో అంబేద్కర్ సంఘం, కోహెడలో పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో బోనాలు సమర్పించారు.

తవ్వుకున్నోళ్లకు తవ్వుకున్నంత..

- మనోహరాబాద్, అక్కన్నపేట మండలాల్లో జోరుగా అక్రమ తవ్వకాలు
- అనుమతి గోరంత.. తవ్వేది కొండంత
- రూ.కోట్లు కొల్లగొడుతున్న అక్రమార్కులు
- చూసీచూడనట్లు వ్యవహరిస్తున్న అధికారులు

7

ఆపదలో ఆదుకునే 'ఎన్‌ఎఫ్‌బీఎస్'


- కుటుంబ పెద్ద చనిపోతే రూ.20 వేల సాయం పొందే వీలు
- ప్రజల్లో అవగాహన లోపంతో వినియోగించుకోని వైనం
- అధికారులూ మిన్నకుండిపోవడంతో నిరుపయోగంగా మారిన పథకం

7

ఒగ్గు, పంబాల కళాకారులకు
నంది అవార్డులు

7

గ్రూపు రాజకీయాలతో కొట్టుమిట్టాడుతున్న కాంగ్రెస్ పార్టీలో పదవుల కోసం నువ్వానేనా అన్నట్లుగా తయారైంది. రాష్ట్రంలో అధికారం వచ్చిన నాటి నుంచి స్థానికంగా ఉన్న నాయకులు ఉప్పునిప్పులా చిటపటమంటున్నారు. సొంత పార్టీలో ఆధిపత్యం కోసం ఆరాట పడుతున్నారు. ఇలాంటి తరుణంలో పార్టీ పదవుల నియామకం తెరమీదకు వచ్చింది. మే నెలలో ఆశావహులంతా బ్లాక్ ఏరియా, మండలం, పట్టణ అధ్యక్ష పదవుల కోసం దరఖాస్తులు సమర్పించారు. ఈ క్రమంలో పదవులకు ఎవరెవరు అర్హులో నేడు తేల్చబోతున్నారు. ఉమ్మడి మెదక్ జిల్లా పీసీసీ ఇన్‌చార్జి, మంత్రి పొన్నం ప్రభాకర్ స్వయంగా ఆశావహులను ఇంటర్వ్యూలు చేసి పదవులు కట్టబెట్టడానికి సిద్ధమయ్యారు. మరికాసేపట్లో గాంధీభవన్‌లో ఉమ్మడి జిల్లా కాంగ్రెస్ నేతలంతా ప్రత్యక్షం కాబోతున్నారు.



అభయహస్తం ఎవరికో?

- కాంగ్రెస్‌లో పదవుల పంపకం
- గాంధీభవన్‌లో నేడు ఇంటర్వ్యూలు
- మండల, పట్టణ, బ్లాక్ అధ్యక్షుల నియామకం
- ఒక్కో పదవికి పదుల సంఖ్యలో దరఖాస్తులు
- ఇంటర్వ్యూ చేయనున్న మంత్రి పొన్నం
- పార్టీలోని గ్రూపు నేతల మధ్య పోటాపోటీ

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సంగారెడ్డి, జూలై 13 : 2014 సంవత్సరంలో అధికారం కోల్పోయిన తర్వాత కాంగ్రెస్ పార్టీ కేడర్ నిరుత్సాహంలో మునిగింది. తలోదారి ఎంచుకోగా కొంతమంది పార్టీలోనే కొనసాగారు. 2018 ఎన్నికల్లోనూ కాంగ్రెస్‌కు నిరాశ ఎదురవ్వడంతో నైరాశ్యం నిండింది. దీంతో పార్టీ పదవులు తీసుకోవాలంటేనే నాయకులు, కార్యకర్తలు తర్జనభర్జన పడ్డారు. పదవుల భారం మోయలేక కొత్తవారు ఆసక్తి చూపకపోవడంతో దశాబ్దాల కాలంగా కొనసాగుతున్నవారు ఎంతోమంది ఉన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో పరిస్థితి తారుమారైంది. చిన్నపాటి పదవికి కూడా పెద్ద ఎత్తున పోటీ నెలకొంది. పదవులు మాకంటే మాకంటూ తమ నేతల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.

అక్కడ కాంగ్రెస్ వర్సెస్ కాంగ్రెస్

ఉమ్మడి జిల్లాలోని పలు నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పార్టీ పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. గజ్వేల్ నియోజకవర్గంలో మొన్నటిదాకా ఇన్‌చార్జి నర్సారెడ్డి, సీనియర్ నేత శ్రీకాంత్‌రావు మధ్య విభేదాలు నెలకొన్నాయి. సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలోనే భగ్గుమన్నారు. మరో సీనియర్ నేత మైనంపల్లి హనుమంతరావు సైతం ఇదే నియోజకవర్గంలో

మిగతా 7వ పేజీలో

900 దరఖాస్తులు

షార్ట్‌లిస్ట్ చేసి పీసీసీకి అందించిన జిల్లా అబ్జర్వర్లు

సిద్దిపేట ఆంధ్రజ్యోతి, జూలై 13 : కాంగ్రెస్ పార్టీ సంస్థాగతంపై దృష్టిసారించగా, దీని కోసం పీసీసీ జిల్లాకు ఇద్దరు అబ్జర్వర్లను నియమించింది. వారు సిద్దిపేట జిల్లాలోని సిద్దిపేట, గజ్వేల్, దుబ్బాక, హుస్నాబాద్‌లో పర్యటించి మండల, పట్టణ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్ష పదవిని ఆశిస్తున్న వారి నుంచి ఈ దరఖాస్తులను స్వీకరించారు. దాదాపు 900 దరఖాస్తులు వచ్చాయి. పీసీసీ నిబంధన మేరకు సీనియారిటీతో పాటు ప్రభుత్వం అధికారంలోకి రాకముందు వచ్చిన వారితో సహ నాలుగైదు పేర్లను మాత్రమే షార్ట్‌లిస్ట్ చేసి పీసీసీకి అందించింది. వీరిలో కాంగ్రెస్ పార్టీనే నమ్ముకున్న వారికి 70 శాతం ప్రాధాన్యతను ఇస్తుండగా, మిగిలిన 30 శాతం 2022లో పార్టీలో చేరిన వారికి అవకాశం ఇవ్వనున్నారు. ముందుగా జిల్లాలోని 26 మండలాల అధ్యక్షులతో పాటు, ఐదు మున్సిపల్‌లోని పట్టణ అధ్యక్షులు, నియోజకవర్గానికి రెండు చొప్పున బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు నియమితులు కానున్నారు. కాగా, జనరల్ సెక్రటరీ పదవుల కోసం కూడా తీవ్రపోటీ నెలకొంది. ఇవి పూర్తయిన తరువాత డీసీసీ పదవిని భర్తీ చేయనున్నారు. ఆగస్టు నెలలో డీసీసీ అధ్యక్ష పదవి నియమాకం పూర్తయ్యే అవకాశం ఉంది. వీటితో పాటుగా ఉమ్మడి మెదక్ జిల్లా పరిధిలోని రెండు పార్లమెంట్ నియోజకవర్గాల నుంచి ఒక్కో జనరల్ సెక్రటరీ చొప్పున పీసీసీలో చోటు కల్పించనున్నారు.



సిద్దిపేట నియోజకవర్గంలో పార్టీ పదవుల కోసం దరఖాస్తులు అందించేందుకు వచ్చిన నాయకులు (ఫైల్)



పోగొట్టుకున్న సెల్‌ఫోన్లను బాధితులకు అందజేసిన సీపీ అనురాధ, పోలీస్ అధికారులు (ఫైల్)

సెల్‌ఫోన్ పోయిందా.. సీఈఐఆర్ ఉందిగా..!

పోర్టల్‌తో సులువుగా గుర్తింపు.. జిల్లాలో ఇప్పటికే 2450 సెల్‌ఫోన్లు స్వాధీనం

సిద్దిపేట క్రైం, జూలై 13 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ షాపింగ్, బిల్లులు చెల్లించడం, రీఛార్జ్‌లు చేయడం వంటి ఎన్నో పనులకు నేడు సెల్‌ఫోన్ తప్పనిసరి. విలువైన వ్యక్తిగత సమాచారం సైతం ఫోన్‌లలోనే భద్రపరుస్తుంటాం. అందుకే సెల్‌ఫోన్ పోగొట్టుకుంటే కలిగే బాధ వర్ణనాతీతం. ఏం చేసినా ఫోన్ తిరిగి దొరుకుతుందనే నమ్మకమూ ఉండేది కాదు. ఈ సమస్యను పరిష్కరించేందుకు కేంద్ర ప్రభుత్వం వెబ్‌సైట్‌ను అందుబాటులోకి తెచ్చింది. అదే సీఈఐఆర్ (సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్) పోర్టల్. సెల్‌ఫోన్ పోయిన వెంటనే ఈ వెబ్‌సైట్‌లో వివరాలు నమోదు చేస్తే, వీలైనంత త్వరగా ఫోన్ దొరికే అవకాశం ఉంటుంది. సిద్దిపేట జిల్లాలో ఇప్పటికే 2450 సెల్‌ఫోన్‌లను పోలీసులు గుర్తించి, బాధితులకు అందజేశారు.

వెబ్‌సైట్‌లో వివరాలు నమోదు ఇలా

సెల్‌ఫోన్ పోయిన వెంటనే సీఈఐఆర్ వెబ్‌సైట్‌లోకి వెళ్లి ఫోన్ బ్లాక్ ఆప్షన్‌ను ఎంచుకోవాలి. అందులో ఫోన్ నంబర్, ఫోన్ బ్రాండ్, మోడల్, ఫోన్ బిల్లు ఫొటో వంటి వివరాలను సంబంధిత బాక్స్‌లలో నింపాలి. అలాగే, సెల్‌ఫోన్ పోగొట్టుకున్న తేదీ, ప్రాంతం, పోలీస్ స్టేషన్‌లో చేసిన ఫిర్యాదు నంబర్, ఫోన్ యజమాని చిరునామా, మెయిల్ ఐడీ వంటివి కూడా కచ్చితంగా నమోదు చేయాలి. తర్వాత, పోయిన ఫోన్ నంబర్‌పై తీసుకున్న కొత్త సిమ్ నంబర్‌కు ఒక ఓటీపీ వస్తుంది. ఆ ఓటీపీని ఎంటర్ చేసిన తర్వాత, నింపిన ఫామ్‌ను సబ్‌మిట్ చేయాలి. ఇలా చేసిన వెంటనే పోయిన ఫోన్ ఆటోమేటిక్‌గా బ్లాక్ అవుతుంది. ఫోన్‌ను ఎవరైనా దొంగిలించినా, సెకండ్ హ్యాండ్‌లో కొన్నా, అందులో సిమ్ వేయగానే మీ కొత్త నంబర్‌కు రిక్వెస్ట్ ఐడీ మెసేజ్ వస్తుంది. ఈ మెసేజ్ ఆధారంగా ఫోన్ ఎక్కడ ఉందో పోలీసులు పట్టుకోవచ్చు.


దొరికిన తర్వాత అన్‌బ్లాక్ చేసుకోవచ్చు

సీఈఐఆర్ పోర్టల్‌లో వివరాలు నమోదు చేసిన కొద్ది రోజులకు పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను పోలీసులు పట్టుకున్నా లేదా బాధితులకు స్వయంగా దొరికినా, దాన్ని అన్‌బ్లాక్ చేసుకోవచ్చు. అలాగే, సెకండ్ హ్యాండ్‌లో ఫోన్ కొనేటప్పుడు, అది దొంగలించిన ఫోనా లేదా బ్లాక్ అయి ఉందా అనే విషయాన్ని కేవైఎం (నో యువర్ మొబైల్) విధానంలో ముందే తెలుసుకోవచ్చు. దీనికోసం, ఫోన్‌లో కేవైఎమ్ అని పెద్ద అక్షరాలతో టైప్ చేసి, ఆ తర్వాత ఐఎంఈఐ నంబర్‌ను టైప్ చేసి 14422 నంబర్‌కు మెసేజ్ పంపాలి. ఈ సౌకర్యం కోసం ఆండ్రాయిడ్ మొబైల్ యూజర్లు ప్లే స్టోర్ నుండి కేవైఎమ్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి.

కొంతమంది డయాగ్నోస్టిక్ సెంటర్ల నిర్వాహకులు ప్రజల అనారోగ్యాన్ని కాసులు కురిపించే అవకాశంగా చూస్తున్నారు. పాథాలజిస్టులు, రేడియాలజిస్టులు లేకుండానే ల్యాబ్‌లను నడిపిస్తూ, అర్హత లేనివారితో పరీక్షలు నిర్వహిస్తూ, ప్రజల ఆరోగ్యాన్ని ప్రమాదంలో పడేస్తున్నారు. కొంతమంది డాక్టర్లు డయాగ్నోస్టిక్ సెంటర్ల కమీషన్ల కోసం అనవసరమైన టెస్టులు రాస్తుంటే... ల్యాబ్‌ల నిర్వహకులు నకిలీ నివేదికలతో జేబులు నింపుకుంటున్నారు. జిల్లా అధికారుల పర్యవేక్షణ కొరవడటంతో ఈ అక్రమాలకు అడ్డూఅదుపూ లేకుండా పోయింది.

మాయాగ్నోస్టిక్‌లు

- అర్హత లేనివారితో ల్యాబ్‌ల నిర్వహణ
- వైద్యులకు కమీషన్లు.. రోగులకు అనవసర పరీక్షలు
- నకిలీ రిపోర్టులతో మోసం.. ప్రాణాలతో చెలగాటం!
- అధికారుల నిర్లక్ష్యం.. తనిఖీలు శూన్యం



గజ్వేల్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఉన్న కొన్ని ప్రైవేటు ల్యాబ్‌లలో పాథాలజిస్టులు అసలు కనిపించడం లేదు. నిబంధనల ప్రకారం యూరిన్ కల్చర్, బ్లడ్ కల్చర్, ప్లేట్‌లెట్ కౌంట్ వంటి కీలక పరీక్షలు చేయవలసిన పాథాలజిస్టులు చాలా డయాగ్నోస్టిక్ సెంటర్లలో లేరు. అరువుకు తెచ్చుకున్న సర్టిఫికెట్లతో కొద్దిరోజులు ల్యాబ్‌లలో పని చేసి, కనీస అవగాహనతోనే రిపోర్టులు ఇస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇంటర్మీడియట్ కూడా పాస్ కాని వ్యక్తులు సైతం పరీక్షలు చేస్తున్నారు. ఇలాంటి వారు ఇచ్చిన రిపోర్టులను చూసి డాక్టర్లు రోగులకు చికిత్స అందిస్తున్నారు. కొన్నిచోట్ల రోగులకు వ్యాధుల లక్షణాలు లేకపోయినా, రిపోర్టుల్లో ఏమీ లేదని సూచించినా, వైద్యులు మరో డయాగ్నోస్టిక్ సెంటర్‌కు రిఫర్ చేస్తున్నారు. దీంతో ప్రజలకు డబుల్ ఖర్చులు తప్పడం లేదు. అంతేకాకుండా మొదటి రిపోర్టుకి, రెండో రిపోర్టుకి తేడాలు వస్తుండడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

గజ్వేల్‌లో 'నకిలీ'లలు

గజ్వేల్ పట్టణంలో డయాగ్నోస్టిక్ సెంటర్ల దందా జోరుగా సాగుతోంది. పాథాలజిస్టులు, రేడియాలజిస్టులు లేకుండానే ల్యాబ్‌లను నడిపేస్తున్నారు. అర్హత లేనివారితో స్కానింగ్‌లు చేయిస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. గజ్వేల్ పరిధిలో పేరుపొందిన కొన్ని ల్యాబ్‌లు సైతం బినామీ పేర్లతో డయాగ్నోస్టిక్ సెంటర్లను ఏర్పాటు చేసి, యథేచ్ఛగా నకిలీలతో పని కానిచ్చేస్తున్నాయి. రేడియాలజిస్టు లేదా పాథాలజిస్టు సంతకం కావాలంటే, అసలు వైద్యులకు ఫోన్ చేసి ఆన్‌లైన్‌లో సంతకం చేయించుకోవడం లేదా ల్యాబ్‌లో ఉన్న నకిలీలే సంతకాన్ని ఫోర్జరీ చేయడం సాధారణమైపోయింది. గర్భిణులకు ఉమ్మనీరు తగ్గకున్నా, తగ్గినట్లు నివేదికలు ఇస్తున్నారనే ఆరోపణలు ఆందోళన కలిగిస్తున్నాయి. పాతకాలం నాటి పరీక్ష యంత్రాలతో పరీక్షలు చేస్తూ ప్రజలను మోసం చేస్తున్నారు.

కమీషన్ల దందా.. అధిక వసూళ్లు

గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేసే

మిగతా 8వ పేజీలో

అట్టహాసంగా నటరాజ పూజ

సిద్దిపేట కల్చరల్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): వ్యాస పూర్ణిమ సందర్భంగా సిద్దిపేటలో నటరాజ పూజా ఉత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. సంస్కార భారతి, మహిళా జాగరణ సమితి కలిసి వ్యాస మహర్షి యోగ సెంటర్‌లో ఈ వేడుకను నిర్వహించాయి. సంస్కార భారతి జిల్లా అధ్యక్షురాలు లక్కిరెడ్డి విజయ శుభాకర్‌రెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సమాజ సేవ చేస్తున్న కళాకారులను, రచయితలను, నాట్యకారులను గౌరవించి సన్మానించారు. భవాని డాన్స్ అకాడమీ డాక్టర్ భవానీ శిష్యులు చేసిన నాట్య ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి.

చదువుతోనే గౌరవం పెరుగుతుంది

- అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ విజయకృష్ణారెడ్డి



మాట్లాడుతున్న రిజిస్ట్రార్ విజయకృష్ణారెడ్డి

సిద్దిపేట కల్చరల్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): చదువు ద్వారానే సమాజం అభివృద్ధి చెందుతుంది, మనిషికి గౌరవం పెరుగుతుంది అని డా.బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఎల్.విజయకృష్ణారెడ్డి అన్నారు. 'అడ్మిషన్ల ప్రక్రియ - ఉపాధి అవకాశాలు' అంశంపై సిద్దిపేట స్టడీ సెంటర్‌లో కోఆర్డినేటర్ డా.శ్రద్ధానందం అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎల్.విజయకృష్ణారెడ్డి మాట్లాడుతూ, ఓపెన్ యూనివర్సిటీ పేదలకు చదువును దగ్గర చేసిందని చెప్పారు. ఈ యూనివర్సిటీలో చదువుకున్నవారు ఇప్పుడు చాలా రంగాల్లో పనిచేస్తున్నారని గుర్తుచేశారు. 2025-26 సంవత్సరానికి డిగ్రీ, పీజీ అడ్మిషన్లు మొదలయ్యాయని చెప్పారు. స్టూడెంట్ సర్వీస్ బ్రాంచ్ డైరెక్టర్ ప్రొఫెసర్ వై.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ కొన్ని కంపెనీలతో ఒప్పందాలు చేసుకుందని, దీనివల్ల విద్యార్థులకు శిక్షణ, ఉద్యోగాలు దొరికే అవకాశం ఉందని తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని సూచించారు. అనంతరం కొత్త అడ్మిషన్ల పోస్టర్‌ను విడుదల చేశారు.


రైతుతో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

● మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్ కల్చరల్, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. ఆదివారం మెదక్ మండల పరిధిలోని పేరూరు గ్రామంలో రైతులతో కలిసి పంట పొలాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం రైతులతో మాట్లాడుతూ నిరంతర విద్యుత్ సరఫరా ఎలా ఉన్నదని ఆరా తీశారు. యూరియా ఇతర పురుగు మందుల సరఫరా గురించి రైతులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, రైతులు పాల్గొన్నారు.













మంత్రాల నెపంతో యువకుడి హత్య


తాజోద్దీన్ (ఫైల్)

జహీరాబాద్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): మంత్రాలు చేస్తున్నాడనే నెపంతో సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణానికి చెందిన యువకుడిని ముగ్గురు కలిసి హత్య చేశారు. ఈ సంఘటన శనివారం రాత్రి చోటుచేసుకుంది. ఆదివారం పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. జహీరాబాద్‌కు చెందిన తాజోద్దీన్ మంత్రాలు చేస్తున్నాడని అదే పట్టణానికి చెందిన హసన్, అక్బర్, ముక్రం అనుమానం పెంచుకున్నారు. తాజోద్దీన్ తమ ఇంటికి వచ్చి వెళ్లిన ప్రతీసారి వారి ఇళ్లలో కుటుంబసభ్యుల్లో ఎవరో ఒకరు అనారోగ్యానికి గురవుతుండడంతో అతనే కారణమని భావించి ఎలాగైనా హతమార్చాలని నిర్ణయించుకున్నారు. శనివారం రాత్రి తాజోద్దీన్‌ను ముగ్గురు కలిసి నాగుల కట్ట వద్ద నుంచి తీసుకువెళ్లి మరణాయుధాలతో దాడి చేసి చంపేశారు. అనంతరం మృతదేహాన్ని సంచిలో చుట్టి సిద్దేశ్వరమఠం సమీపంలో గల పాడుబడిన బావిలో పడేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జహీరాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనుమానంతో హసన్, అక్బర్, ముక్రంను అదుపులోకి తీసుకుని విచారించగా తామే హత్య చేసినట్లు ఒప్పుకున్నారని పోలీసులు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని, మరిన్ని వివరాలు తెలియాల్సి ఉందని పోలీసులు వెల్లడించారు.

వైద్యం వికటించి యువకుడి మృతి


అహ్మద్ ఇర్ఫానుద్దీన్ (ఫైల్)

సిద్దిపేట ఆంధ్రజ్యోతి, జూలై 13: వైద్యం వికటించి యువకుడు మృతిచెందిన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. మృతుడి తల్లిదండ్రులు ఎండీ అహ్మద్‌గయాసుద్దీన్ పటేల్, ఖమర్‌జహాన్ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని సాజిద్‌పురకు చెందిన అహ్మద్ ఇర్ఫానుద్దీన్ పటేల్ (28) కొన్ని రోజులుగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. నొప్పి భరించలేక పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో వైద్యపరీక్షలు నిర్వహించగా, శస్త్రచికిత్స తప్పనిసరిగా చేసుకోవాలని వైద్యులు సూచించారు. దీంతో అహ్మద్ ఇర్ఫానుద్దీన్ పటేల్ ఈ నెల 11న నమాజ్ చేసిన తర్వాత నడుచుకుంటూ సదరు ఆసుపత్రికి వెళ్లి అడ్మిట్ అయ్యాడు. అతన్ని వైద్యులు ఆపరేషన్ థియేటర్‌లోకి తీసుకెళ్లిన కొద్దిసేపటి తర్వాత, బీపీ తగ్గిందని, హుటాహుటిన హైదరాబాద్‌కు తీసుకెళ్లాలని సూచించారు. కుటుంబీకులు హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి ఆదివారం ఉదయం మృతి చెందాడు. అనుమానం వచ్చిన కుటుంబీకులు సిద్దిపేటలోని వైద్యులను సంప్రదించగా అపెండెక్స్ ఆపరేషన్ చేయలేదని, చేశామని ఒక్కో సారి ఒక్కోతీరుగా సమాధానం చెప్పడం తో తల్లిదండ్రులు వైద్యుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. డాక్టర్ తప్పిదం వల్లే తమ కొడుకు చనిపోయాడని ఆరోపించారు. ఆసుపత్రి వైద్యులపై చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు. మృతునికి రెండేళ్ల క్రితం వివాహమైంది. ప్రస్తుతం 14 నెలలు బాబు ఉన్నాడు.

ఇల్లు దగ్ధం


కాలిపోయిన ఫ్యాను, సామాను

నారాయణఖేడ్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో ఇల్లు దగ్ధమైన సంఘటన నారాయణఖేడ్ మండలంలోని అబ్బెందలో చోటుచేసుకున్నది. గ్రామానికి చెందిన నెర్గల్ శివరాములు ఇంట్లో శనివారం రాత్రి విద్యుదాఘాతం ఏర్పడి మంటలు చెలరేగాయి. ఇంట్లోని 2 క్వింటాళ్ల బియ్యం, 2 క్వింటాళ్ల జొన్నలు, రూ.2.76 లక్షల నగదు, ఇతర వస్తువులు పూర్తిగా కాలిబూడిదయ్యాయి.

బోడ్మాట్‌పల్లిలో

పాడి గేదె..

టేక్మాల్, జూలై 13(ఆంధ్రజ్యోతి) : విద్యుదాఘాతంతో పాడి గేదె మృతిచెందిన సంఘటన టేక్మాల్ మండలంలోని బోడ్మాట్‌పల్లి గ్రామ శివారులో శనివారం రాత్రి చోటుచేసుకున్నది. గ్రామానికి చెందిన ముద్దపురం నాగప్పకు చెందిన గేదె మేతకోసం గ్రామ శివారులోకి వెళ్లింది. ట్రాన్సఫార్మర్ వద్ద ఉన్న వైర్‌కు తగిలి విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందింది. గేదె విలువ రూ.60 వేలు ఉంటుందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతు కోరాడు.

విద్యుదాఘాతంతో ఇద్దరు రైతులు మృతి

చేగుంట జూలై 13 (ఆంధ్రజ్యోతి): పొలంలో ట్రాన్స్‌ఫార్మర్ ఫీజు వైరు సరిచేస్తుండగా విద్యుదాఘాతంతో ఓ రైతు మృతి చెందాడు. ఈ ఘటన మెదక్ జిల్లా చేగుంట మండలం బోనాలలో ఆదివారం సాయంత్రం జరిగింది. గ్రామానికి చెందిన రైతు మురాడి చిత్తం (54)కు గ్రామ శివారులోని పొలం ఉంది. ఆదివారం తన పొలం వద్ద బోరు మోటార్‌కు విద్యుత్ సరఫరా కాకపోవడంతో అక్కడే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఫీజు వైరు వేస్తుండగా పైన ఉన్న 11కేవీ లైన్‌కు తగలడంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు చేగుంట ఎస్ఐ చైతన్య కుమార్ రెడ్డి వెల్లడించారు.


మురాడి చిత్తం, మేడికాయల పోచయ్య మృతదేహాలు

మల్యాలలో..

సిద్దిపేట రూరల్, జూలై 13(ఆంధ్రజ్యోతి): నారాయణరావుపేట మండలం మల్యాలకు చెందిన మేడికాయల పోచయ్య(65) శనివారం మధ్యాహ్నం తన పొలం వద్ద వరి నారుమడికి నీళ్ల పెట్టేందుకు వెళ్లాడు. స్టార్టర్‌కు విద్యుత్ సరఫరా కాకపోవడంతో దగ్గరలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ పరిశీలించగా ఫ్యూజ్ వైరు పోయిందని గుర్తించాడు. మరమ్మత్తు చేస్తుండగా విద్యుత్ సరఫరా కావడంతో షాక్ కొట్టి తీవ్రగాయాలై కింద పడిపోయాడు. గమనించిన స్థానికులు వెంటనే 108 అంబులెన్స్ వాహనంలో సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ రాత్రి మృతిచెందాడు. మృతునికి భార్య, ఇద్దరు కొడుకు ఉన్నారు. జరిగిన సంఘటనపై మృతుని కొడుకు మేడికాయల శ్రీనివాస్ ఫిర్యాదు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చిన్నకోడురు పోలీసులు తెలిపారు.

హెల్త్ కేర్ మేనేజ్‌మెంట్ ప్రోగ్రాంలో జీజీహెచ్ వైద్యాధికారులు

● మెడికల్ అడ్మినిస్ట్రేటర్స్ ట్రైనింగ్ పూర్తి

సంగారెడ్డి అర్బన్, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్ గచ్చిబౌలిలోని ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్(ఐఎస్‌బీ)లో జరిగిన హెల్త్ కేర్ మేనేజ్‌మెంట్ ప్రోగ్రాంలో సంగారెడ్డిలోని ప్రభుత్వ మెడికల్ కళాశాల, అనుబంధ బోధనాస్పత్రి వైద్యాధికారులు పాల్గొన్నారు. కమిషనర్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ ఆధ్వర్యంలో ఐఎస్‌బీ సహకారంతో గతేడాది ఆగస్టు నెల నుంచి మొదలుకుని ప్రతి నెలా ఒకట్రెండు రోజుల పాటు మెడికల్ అడ్మినిస్ట్రేటర్లకు నిర్వహించిన శిక్షణా కార్యక్రమం ఆదివారం విజయవంతంగా ముగిసింది. ఇందులో సంగారెడ్డి జీజీహెచ్ జనరల్ సర్జరీ ప్రొఫెసర్ డాక్టర్ జి.అనిల్‌కుమార్, ప్రభుత్వ మెడికల్ కాలేజీకి చెందిన మైక్రోబయోలజీ హెచ్‌వోడీ డాక్టర్ సుధామాధురితో పాటు జీజీహెచ్ ఆసుపత్రి అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ సందీప్ ఐఎస్‌బీ ఆపరేషన్స్ మేనేజ్‌మెంట్ ప్రొఫెసర్ సారంగ్‌డియో చేతుల మీదుగా శిక్షణ పూర్తి చేసుకున్న సర్టిఫికెట్‌ను అందుకున్నారు. ఏడాది కాలం పాటు దశల వారీగా పొందిన శిక్షణ వైద్య సేవలు, పరిపాలనపరంగా ఎంతగానో ఉపయోగపడనుందని ఆయా వైద్యాధికారులు తెలిపారు.


ఐఎస్‌బీ ప్రొఫెసర్ సారంగ్‌డియో నుంచి సర్టిఫికెట్ అందుకుంటున్న అనిల్‌కుమార్

ఏడుపాయల, కొమురవెల్లికి పోటెత్తిన భక్తులు

పాపన్నపేట, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : వనదుర్గా ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. ఆషాఢమాసం మూడో ఆదివారాన్ని పురస్కరించుకుని అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. అభిషేకం, అర్చనలు నిర్వహించారు. ఉమ్మడి మెదక్ జిల్లాతో పాటు ఇతర జిల్లాలు, రాష్ట్రాల నుంచి కూడా భక్తులు భారీగా తరలివచ్చారు. ఏడుపాయలలో పుణ్యస్నానాలు ఆచరించి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. పలువురు బోనాలు సమర్పించారు. మరికొందరు తలనీలాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ పరిసరాలు భక్తులు కిటకిటలాడాయి. ఆలయ అర్చకులు పూజలు చేపట్టి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఎవరికీ ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ సిబ్బంది ఏర్పాట్లు చేశారు.


ప్రత్యేక అలంకరణలో వనదుర్గామాత

మల్లన్న ఆలయంలో..

చేర్యాల : కొమురవెల్లి మల్లికార్జునస్వామి ఆలయ సందర్శనార్థం ఆదివారం భక్తులు తరలివచ్చారు. తలనీలాలు సమర్పించి కోనేరులో పుణ్యస్నాన మాచరించారు. భక్తిప్రపత్తులతో బోనంనివేదించి చెలక, నజరు, ముఖ మండప పట్నాలు రచించారు. స్వామివారిని దర్శించుకుని పట్టువస్త్రాలు, బండారి, ఒడిబియ్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఎల్లమ్మతల్లికి కల్లు, బెల్లంపానకం శాక పెట్టి బోనం నివేదించారు. తమ కోర్కెలు ఈడేర్చమని వేడుకుంటూ గంగిరేగుచెట్టుకు ముడుపులు కట్టారు. సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి బోనాల పండగ సందర్భంగా జంటనగరాల భక్తులు రాకపోవడంతో కాస్త ప్రభావితం చూపింది.

భక్తుల సమస్యలు పరిష్కరిస్తాం

జగదేవ్‌పూర్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): కొండపోచమ్మ ఆలయాభివృద్ధికి తమ వంతు కృషి చేస్తూ భక్తుల సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టనున్నట్లు ఆలయ చైర్‌పర్సన్ అనుగీత అన్నారు. ఆదివారం కొండపోచమ్మ ఆలయంలో అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కార్యాలయంలో డైరెక్టర్‌లు వెంకట్‌రాంరెడ్డి, నర్సింలు, రాజు, నరేష్‌లతో కలిసి ఆలయాభివృద్ధిపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కొండపోచమ్మ ఆలయం వద్ద ప్రధాన సమస్యలను గుర్తించినట్లు చెప్పారు. తాగునీటి సమస్య, మహిళా భక్తులకు సౌకర్యాలు, పారిశుధ్యం, అతిథుల కోసం గెస్ట్‌హౌజ్ నిర్మాణం అవసరమని గుర్తించామని తెలిపారు. ఆలయాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.


మాట్లాడుతున్న కొండపోచమ్మ ఆలయ చైర్‌పర్సన్ అనుగీత


కొమురవెల్లి ఆలయ రాజగోపుర ఆవరణలో భక్తుల రద్దీ

తవ్వుకునోళ్లకు తవ్వుకున్నంత..



- మనోహరాబాద్, అక్కన్నపేట మండలాల్లో జోరుగా అక్రమ తవ్వకాలు
- అనుమతి గోరంత.. తవ్వేది కొండంత
- రూ.కోట్లు కొల్లగొడుతున్న అక్రమార్కులు
- చూసీచూడనట్లు వ్యవహరిస్తున్న అధికారులు

మనోహరాబాద్, అక్కన్నపేట మండలాల్లో మట్టి, ఇసుక అక్రమ దందాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. అక్రమార్కులు అనుమతుల ముసుగులో కోట్ల రూపాయల కొల్లగొడుతున్నారు. కొంత అనుమతి తీసుకుని.. తవ్వకాలు మాత్రం అంతటా జరుపుతూ దోపిడీకి పాల్పడుతున్నారు. ఈ మాఫియాకు అడ్డుకట్ట వేయాల్సిన అధికార యంత్రాంగం చూసీ చూడనట్టు వదిలేయడమే కాకుండా, 'మామూళ'తో చేతులు కలిపి పరోక్షంగా సహకరిస్తున్నదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.



లింగారెడ్డిపేట్ శివారులో ఎక్స్‌కవేటర్‌తో కొండను తవ్వి లారీలో నింపుతున్న మట్టి

మనోహరాబాద్/అక్కన్నపేట, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : మట్టి, ఇసుక దందా మూడు పువ్వులు ఆరు కాయలు అన్న చందంగా సాగుతోంది. నూతనంగా నిర్మిస్తున్న అనేక పరిశ్రమలను ఆసరాగా చేసుకుని, మట్టి మాఫియా ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నది. మనోహరాబాద్ మండలంలోని లింగారెడ్డిపేట గ్రామ శివారులో ఓ కాంగ్రెస్ నాయకుడు, ప్రజాప్రతినిధి మెదక్ జిల్లా మైనింగ్ శాఖ నుంచి అనుమతి తీసుకున్నాడు. ఇదే అదునుగా గ్రామ రైతు పొలం గుట్టకు అనుమతి ఉందని చెప్పి, గత నెల రోజులకు పైగా అక్రమంగావేల ట్రిప్పుల మట్టిని పరిశ్రమలకు తరలిస్తున్నాడని స్థానికులు ఆరోపిస్తున్నారు. రాత్రి పగలు తేడా లేకుండా మట్టిని తరలిస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మట్టి మాఫియా మండల, జిల్లా అధికారులను చేతిలో పెట్టుకుని, ముడుపులు చెల్లిస్తూ పెద్ద ఎత్తున మట్టిని పరిశ్రమలకు తరలిస్తూ కోట్ల రూపాయలు పోగేసుకుంటున్నారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సదరు కాంగ్రెస్ నాయకుడు నేనే రాజు, నేనే మంత్రి అన్న విధంగా మట్టి దందాను నడిపిస్తున్నాడు. అనుమతి తీసుకున్న మేరకే మట్టిని తవ్వేలా జిల్లా కలెక్టర్ మట్టి మాఫియాపై తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయంపై జిల్లా మైనింగ్ శాఖ అధికారి విజయ్‌కుమార్ రాథోడ్‌ను వివరణ కోరగా అనుమతి ఇచ్చింది నిజమే, కానీ ఎంత మేరకు మట్టి తరలింపు చేస్తున్నారని త్వరలో తనిఖీలు చేస్తామని తెలిపారు.

అక్కన్నపేటలో ఇసుక దందా..

ఇక అక్కన్నపేట మండలంలో గత కొన్ని రోజులుగా జోరుగా ఇసుక అక్రమ రవాణా జరుగుతున్నా అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సామాన్యులు తమ ఇంటి నిర్మాణ పనులకు తట్ట ఇసుక ముట్టనివ్వరు కానీ, అక్రమార్కులు ట్రిప్పులకొద్దీ ఇసుక రవాణా చేస్తున్నా అటు వైపు కన్నెత్తి చూడడం లేదని మండిపడుతున్నారు. మండలంలోని అక్కన్నపేట, జనగామ, గౌరవెల్లి వాగుల నుంచి గత కొన్ని రోజుల నుంచి ఇసుక అక్రమ రవాణా ఆగడం లేదు. కొందరు అధికార పార్టీ నేతలు అభివృద్ధి పనుల పేరిట అనుమతులు తీసుకుంటే, ఇదే అదనుగా భావించి వందలాది ట్రిప్పుల ఇసుకను అక్రమంగా ఒక్కో ట్రిప్ ట్రాక్టర్ ఇసుకకు రూ. 5 వేల చొప్పున అమ్ముకుంటున్నారని వాపోతున్నారు ఇంత జరుగుతున్నా అధికారులు పట్టించుకోకపోవడంతో ఇసుక మాఫియా అందినకాడికి దోచుకుంటున్నది ఆరోపిస్తున్నారు.



అక్కన్నపేట వాగులో నుంచి ట్రాక్టర్‌లో ఇసుక తరలింపు

అభివృద్ధి పనులకంటూ..

పలు అభివృద్ధి పనుల కోసం ఇసుకను తరలిస్తున్నామని తప్పుడు కాగితాలు చూపిస్తూ అక్రమ రవాణాను కొనసాగిస్తున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆయా గ్రామాల్లో ప్రజలు, యువకులు ఇసుక అక్రమ రవాణాను అడ్డుకుని రెవెన్యూ అధికారులకు సమాచారం అందించినా వారి నుంచి పూర్తిస్థాయిలో స్పందన లేదనే ఆరోపణలు వస్తున్నాయి. ఒకవేళ వచ్చినా, ముందుగానే ఇసుక రవాణాదారులకు సమాచారం అందించి ట్రాక్టర్లు వెళ్లిపోయిన తర్వాత వస్తున్నారని వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అక్రమ ఇసుక రవాణాదారులను స్థానికులు అడ్డుకుని ప్రశ్నిస్తే, అధికారులకు ఏమి కావాలో నెల నెలా సమకూర్చుతున్నామని.. తమను ఎవరూ పట్టుకోరని వారు బహిరంగంగానే చెప్పడం గమనార్హం.

అసభ్యంగా దూషిస్తున్నారు.. న్యాయం చేయండి

- సంగారెడ్డి కలెక్టర్‌ను కోరిన పారిశుధ్య కార్మికులు

సంగారెడ్డి క్రైం, జూలై 13 (ఆంధ్రజ్యోతి): అకారణంగా తమను పదే పదే అసభ్య పదజాలంతో దూషిస్తున్నారని ఓ మహిళా అధికారిపై మహిళా పారిశుధ్య కార్మికులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. సంగారెడ్డి జిల్లాలోని ఓ మహిళా ఉన్నతాధికారి కొన్నిరోజులుగా తమను అకారణంగా నోటికొచ్చినట్లు అసభ్య పదజాలంతో తిడుతున్నారని అధికారి కార్యాలయం వద్ద, ఇంట్లో పనిచేసే మహిళా పారిశుధ్య కార్మికులు ఆరోపిస్తున్నారు. తమకు న్యాయం చేయాలని కోరుతూ దాదాపు 20 మంది కార్మికులు కలెక్టర్ పి.ప్రావీణ్యను కలిసి వినతిపత్రం సమర్పించారు. తమ గౌరవ మర్యాదలు కాపాడమని కోరారు. కార్మికులమైనంత మాత్రాన నోటికొచ్చినట్లు తిడితే పడాలా అని ఆవేదన వ్యక్తం చేశారు.

ఒగ్గు, పంబాల కళాకారులకు నంది అవార్డుల ప్రదానం



రాగుల సారయ్యకు నంది అవార్డు అందించి సన్మానిస్తున్న సాహితీ వేదిక నిర్వాహకులు



జాజాల బాలయ్య

మద్దూరు, జూలై 13 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట జిల్లా మద్దూరు మండలం లద్నూరు గ్రామానికి చెందిన ప్రముఖ ఒగ్గు కళాకారుడు రాగుల సారయ్య, పంబాల కళాకారుడు జాజాల బాలయ్యలకు ప్రతిష్ఠాత్మక నంది అవార్డులు, ప్రశంసా పత్రాలు లభించాయి. తెలుగు కళారంగంలో వారు అందించిన విశిష్ట సేవలకు గుర్తింపుగా ఈ పురస్కారాలు దక్కాయి. హైదరాబాద్‌లోని చిక్కడపల్లి త్యాగరాయ గానసభలో తెలుగు వెలుగు సాహితీ వేదిక ఆధ్వర్యంలో శనివారం రాత్రి జరిగిన నందమూరి తారక రామారావు, పి.వి. నరసింహారావు జయంతి ఉత్సవాల సందర్భంగా ఈ నంది అవార్డుల ప్రదానోత్సవం జరిగింది. దైవజ్ఞ శర్మ (గౌరవ అధ్యక్షులు, తెలుగు వెలుగు సాహితీ వేదిక), వంగాల శాంతి కృష్ణ ఆచార్య (తెలుగు వెలుగు సాహితీ వేదిక పినపల్లి చైర్మన్), డాక్టర్ వలబోజు మోహన్‌రావు (జాతీయ ప్రధాన కార్యదర్శి, తెలుగు వెలుగు సాహితీ వేదిక), భాస్కర్ రావు (జాతీయ అధ్యక్షులు, తెలుగు వెలుగు) చేతుల మీదుగా రాగుల సారయ్య, జాజాల బాలయ్య ఈ అవార్డులను అందుకున్నారు.

16న వాహన వేలం

మద్దూరు, జూలై 13(ఆంధ్రజ్యోతి): చేర్యాల ఎక్సైజ్ శాఖ పట్టుబడిన ఒక టాటా ఇండికా వాహనానికి ఈ నెల 16న వేలం పాట నిర్వహించనున్నట్లు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ సురేష్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల వారు పాల్గొనాలని పేర్కొన్నారు. వాహనం కనీస ధర రూ.25 వేలుగా నిర్ణయించగా, వేలంలో పాల్గొనేందుకు రూ.6,250 (25 శాతం) నగదు డిపాజిట్ చేయాలని తెలిపారు. వేలంలో అధిక ధరకు వాహనాన్ని దక్కించుకున్న వారు 18 శాతం జీఎస్టీ చెల్లించాలని పేర్కొన్నారు.

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య



మైసయ్య (ఫైల్)

వెల్దుర్తి, జూలై 13 (ఆంధ్రజ్యోతి): అప్పుల బాధ, ఆర్థిక ఇబ్బందులు తాళలేక మండల పరిధిలోని ధర్మారం గ్రామానికి చెందిన క్యాటాల మైసయ్య (52) ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మైసయ్యకు ఒక కుమారుడు, ఒక కూతురు ఉన్నారు. గత సంవత్సరం కూతురికి వివాహం చేయడంతో అప్పులు పెరిగి ఆర్థిక ఇబ్బందులు తలెత్తాయి. హైదరాబాద్‌లోని అల్వాల్‌లో పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్న మైసయ్య, శనివారం మధ్యాహ్నం తన భార్య, కుమారుడు బంధువుల ఇంటికి వెళ్లిన సమయంలో ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పక్కింటి వారు చూసి మైసయ్య కుమారుడికి సమాచారం అందించారు. వెంటనే ఆసుపత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడి భార్య బాలమ్మ ఫిర్యాదు మేరకు వెల్దుర్తి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అభయహస్తం ఎవరికో?

(5వ పేజీ తరువాయి)

కార్యకలాపాలు సాగిస్తున్నారు. ఇక్కడ మూడు గ్రూపులు తయారయ్యాయి. ఇక సిద్దిపేట నియోజకవర్గంలో ఇన్‌చార్జి పూజల హరికృష్ణకు ఇతర నేతల మధ్య దూరం పెరుగుతున్నది. ఆయనను ఇతర నేతలు బాహాటంగా విమర్శిస్తున్నారు. తమకు పదవుల్లో న్యాయం చేయాలని అటు మంత్రులు పొన్నం ప్రభాకర్, వివేక్, సురేఖ, దామోదర్‌తోపాటు సీనియర్ నేతలు జగ్గారెడ్డి, మైనంపల్లి హన్మంతరావును సిద్దిపేట నేతలు ఆశ్రయిస్తున్నారు. దుబ్బాకలోనూ పార్టీ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి, సీనియర్ నేత శ్రావణ్‌కుమార్‌రెడ్డి మధ్య పార్టీలో అంతర్గత పోరు ఉందనే చర్చ జరుగుతోంది. అదేవిధంగా పటాన్‌చెరు నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ మూడుగా చీలిపోయింది. ఎమ్మెల్యేగా పోటీచేసి ఓడిపోయిన కాటా శ్రీనివాస్‌గౌడ్ ప్రస్తుతం ఇన్‌చార్జిగా ఉన్నారు. ఎంపీగా ఓటమిపాలైన నీలం మధు ఇదే నియోజకవర్గంలో కాంగ్రెస్ నేతగా తిరుగుతున్నారు. బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేగా గెలిచి కాంగ్రెస్‌లో చేరిన మహిపాల్‌రెడ్డి సైతం తనదైన పాత్ర పోషిస్తున్నారు. జహీరాబాద్, నారాయణఖేడ్, నర్సాపూర్ నియోజకవర్గాల్లోనూ అప్పుడప్పుడు విభేదాలు తెరమీదకొస్తున్నాయి.

పదవుల చిక్కుముడి వీడేనా..

నేడు గాంధీభవన్‌లో పదవుల కోసం దరఖాస్తు చేసుకున్న ఆశావహులతో మంత్రి పొన్నం ప్రభాకర్ ముఖాముఖిగా మాట్లాడతారు. బ్లాక్ కాంగ్రెస్, మండల కాంగ్రెస్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్ష పదవులకు పెద్ద ఎత్తున దరఖాస్తులు రావడంతో ఇంటర్వ్యూ అనివార్యమైంది. పదుల సంఖ్యలో వచ్చిన దరఖాస్తులను వడబోసి నాలుగైదు చొప్పున ఎంపిక చేశారు. వీరిని ఇంటర్వ్యూకు ఆహ్వానించారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో 66 మండలాలు, 15 బ్లాకులు, 21 పట్టణాలు ఉన్నాయి. వీటన్నింటికీ కాంగ్రెస్ పార్టీ తరపున అధ్యక్షులను ఎంపిక చేయాల్సి ఉంది. ఈనెల 15వ తేదీ వరకే సంస్థాగతంగా ఎంపిక పూర్తి చేయాలని టీపీసీసీ ఆదేశించింది. ఈ లెక్కన నేడు, రేపటిలోగా పదవుల్లో కొత్త నేతలు ఆశీనులు కాకతప్పదు. గ్రూపు రాజకీయాల నేపథ్యంలో ఈ పదవుల చిక్కుముడి వీడుతుందా.. పెండింగులో పడుతుందా అనే విషయంపై ఉత్కంఠ నెలకొంది.

పొన్నం సమర్థతే కీలకం

పదవుల ఎంపిక ప్రక్రియ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు సవాల్‌గా మారనున్నది. పీసీసీ తరఫున ఉమ్మడి మెదక్ జిల్లా ఇన్‌చార్జిగా ఆయనను ఎంపిక చేయడం వ్యూహాత్మకమేనన్నట్లుగా తెలుస్తోంది. క్షేత్రస్థాయిలో కాంగ్రెస్ పార్టీ నిర్మాణాన్ని బలోపేతం చేయగలరనే ధీమాతోనే మెతుకుసీమ పార్టీ పగ్గాలను ఆయనకు అప్పగించింది. ఆయన ప్రాతినిధ్యం వహిస్తున్న హుస్నాబాద్ నియోజకవర్గం సిద్దిపేట జిల్లాలోనే ఉంది. సిద్దిపేట జిల్లా మంత్రిగానూ ఆయన సేవలందిస్తున్నారు. మెదక్, సంగారెడ్డి జిల్లాలపై అవగాహన లేకపోలేదు. బీఆర్‌ఎస్ పార్టీకి కంచుకోటగా ఉన్న ఈ ప్రాంతంలో కాంగ్రెస్‌ను పటిష్ఠం చేయడానికే పొన్నంను రంగంలోకి దింపింది. మెదక్ పార్లమెంటు స్థానంతోపాటు రెండు ఎమ్మెల్సీలను కైవసం చేసుకొని బీజేపీ కూడా బలపడింది. అందుకే సరైన కార్యకర్తలకు పదవులు కట్టబెట్టడానికి అనుభవంతోపాటు సమర్థుడిగా పేరున్న పొన్నం ప్రభాకర్‌కు కీలక బాధ్యతలు ఇచ్చారు. రెండు రోజుల్లోనే వందకుపైగా ఉన్న పదవుల లెక్క తేల్చాల్సి ఉంది. పార్టీలో సిన్సియర్లకు అవకాశం కల్పిస్తారా.. సీనియర్లకు పదవులు కట్టబెడతారో వేచిచూడాలి.



ఆపదలో ఆదుకునే ఎన్‌ఎఫ్‌బీఎస్

- కుటుంబ పెద్ద చనిపోతే రూ. 20 వేల సాయం పొందే వీలు
- ప్రజల్లో అవగాహన లోపంతో వినియోగించుకోని వైనం
- అధికారులూ మిన్నకుండిపోవడంతో నిరుపయోగంగా మారిన పథకం

రామాయంపేట, జూలై 13 (ఆంధ్రజ్యోతి): దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న కుటుంబ పెద్ద మరణిస్తే రూ.20వేల తక్షణ ఆర్థిక సహాయం అందించే 'జాతీయ కుటుంబ ప్రయోజన పథకం' (ఎన్‌ఎఫ్‌బీఎస్) రామాయంపేట మండలంలో ఆదరణ కోల్పోయింది. అధికారుల అవగాహన లోపమో, ప్రజల నిర్లక్ష్యమో తెలియదు కానీ, గత రెండేళ్లుగా ఈ పథకానికి ఒక్క దరఖాస్తు కూడా నమోదు కాకపోవడం ఆశ్చర్యకరం. దీంతో ఈ పథకం గురించి ప్రజలకు పెద్దగా అవగాహన లేదని స్పష్టమవుతోంది. ప్రతి సంవత్సరం ఎంతో మంది నిరుపేద కుటుంబ పెద్దలు ప్రమాదాలు లేదా అనారోగ్యాల కారణంగా మరణిస్తున్నారు. వారికి ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆర్థిక సహాయం అందడం లేదు. వితంతు పింఛన్ల కోసం వందలాది దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నప్పటికీ, మరణించిన కుటుంబ పెద్ద పేరున వచ్చే ఈ ఆర్థిక సహాయాన్ని ప్రజలు కోరకపోవడం అధికారుల ప్రచార లోపాన్ని స్పష్టం చేస్తోంది. గతంలో ఈ పథకానికి సంబంధించి అనేక దరఖాస్తులు పెండింగ్‌లో ఉండేవని, కానీ గత రెండేళ్లలో పరిస్థితి పూర్తిగా మారిపోయిందని తెలుస్తోంది. ఈ విషయమై తహసీల్దార్ రజనీ కుమారి అభిప్రాయం కోరగా.. తాను ఇక్కడికి వచ్చిన రెండేళ్ల నుంచి ఈ పథకానికి ఒక్క దరఖాస్తు కూడా రాలేదని తెలిపారు. నిరుపేద కుటుంబంలోని యజమాని ఏ పరిస్థితుల్లో మరణించినా రూ.20 వేల ఆర్థిక సహాయం అందించడమే ఈ పథకం ముఖ్య ఉద్దేశమని తెలిపారు.

ఈ పథకం ఎవరికంటే..

- మరణించిన కుటుంబ పెద్ద వయస్సు 18 నుంచి 60 సంవత్సరాల మధ్య ఉండాలి.
- కుటుంబానికి తెల్ల రేషన్ కార్డు ఉండాలి.
- వ్యక్తి మరణించిన నాటి నుంచి మూడేళ్ల లోపు తహసీల్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలి.
- కుటుంబ పెద్ద బతికి ఉన్న సమయంలో ఎలాంటి ప్రభుత్వ లబ్ధి (ప్రభుత్వ బీమా వంటివి) పొంది ఉండకూడదు.



యాజమాన్యం నిర్లక్ష్యమే ప్రమాదానికి కారణం

- సిగాచి బాధితులకు న్యాయం చేయాలి
- తెలంగాణ పౌర సమాజ నిజనిర్ధారణ బృందం



బాధిత కుటుంబ సభ్యుల నుంచి వివరాలు సేకరిస్తున్న పౌర సమాజ నిజనిర్ధారణ బృందం

పటాన్‌చెరు రూరల్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): పాశమైలారంలోని సిగాచి ఫార్మా పరిశ్రమలో జరిగిన భారీ పేలుడు సంఘటనపై తెలంగాణ పౌర సమాజ నిజనిర్ధారణ బృందం తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ కలపాల బాబూరావు నేతృత్వంలోని బృందం ఆదివారం సిగాచి ఫార్మా పరిశ్రమను సందర్శించింది. బాధితుల కుటుంబ సభ్యులు, ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కార్మికులు, ప్రమాదం నుంచి బయటపడిన వారు, అధికారులు, స్థానిక ప్రజలతో మాట్లాడి వివరాలు సేకరించింది. ఈ పేలుడుకు ప్రధాన కారణం యాజమాన్యం యొక్క దీర్ఘకాలిక నిర్లక్ష్యం, భద్రతా ప్రమాణాలను గాలికొదిలేయడమేనని స్పష్టం చేసింది. ఈ ఘటనలో మరణించిన, గాయపడిన కార్మికుల వాస్తవ సంఖ్య, వివరాలను ప్రభుత్వం తక్షణమే ప్రకటించాలని, బాధితుల కుటుంబాలకు ప్రకటించిన పరిహారం వెంటనే చెల్లించాలని, పరిశ్రమ యాజమాన్యంపై హత్యా కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని, భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు జరగకుండా తగిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేసింది. గతంలో పరవాడలోని సినర్జీన్ యాక్టివ్ ఇన్‌గ్రేడియంట్స్‌లో జరిగిన ప్రమాదంపై ఉన్నత స్థాయి కమిటీ నివేదిక ఇంకా బయటకు రాకపోవడం పట్ల కూడా బృందం సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. సిగాచిలో పేలుడుకు అనువైన పరిస్థితులు ఎలా ఏర్పడ్డాయి, మళ్లీ జరగకుండా తీసుకోవాల్సిన చర్యలు ఏమిటి అనే విషయాలపై నిపుణులు విశ్లేషించి తగిన సిఫారసులు చేయాలని బృందం తెలిపింది. ఈ బృందంలో రాష్ట్ర హైకోర్టు సీనియర్ న్యాయవాది వసుధా నాగరాజు, తెలంగాణ పీపుల్స్ జాయింట్ యాక్షన్ కమిటీ రాష్ట్ర కో కన్వీనర్ కన్నెగంటి రవి, రాష్ట్ర కమిటీ సభ్యులు ఆర్.వెంకటరెడ్డి, అశోక్ కుమార్, అసోసియేషన్ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్ సివిల్ రైట్స్ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ ఉస్మాన్, నాయకులు మజీద్ , ప్రజా ఉద్యమాల జాతీయ వేదిక రాష్ట్ర కన్వీనర్ మీరా సంఘ మిత్ర, నాయకులు అఖిల్ సూర్య , సంగారెడ్డి జిల్లా టీపీజేఏసీ నాయకులు జనార్దన్, కందిలి పత్రిక సంపాదకులు రాజేందర్ తదితరులు ఉన్నారు.

బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలి

- పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు, జూలై 13(ఆంధ్రజ్యోతి): యాజమాన్యం, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం వల్లే సిగాచి పరిశ్రమలో 52మంది కార్మికులు బలయ్యారని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం ఎమ్మెల్యే క్యాంపు ఆఫీసులో విలేకరులతో మాట్లాడారు. ఘటనకు కారణమైన యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే జిల్లా కార్మిక అధికారి రవీందర్‌రెడ్డిని కోరారు. లాభాల అత్యాశకు పోయి కార్మికుల బద్రతను గాలికి వదిలిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. లేబర్ కాంట్రాక్టర్లు సైతం బాధ్యతారాహిత్యంగా వ్యవహరించారని విమర్శించారు. తీవ్రంగా గాయపడిన మరో 30 మంది కార్మికుల భవిష్యత్తు కూడా ఆందోళనకరంగా మారిందన్నారు. పరిశ్రమ డైరెక్టర్లు, కాంట్రాక్టర్లపై క్రిమినల్ కేసులు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కాగా, ఆదివారం అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని నవ్య కాలనీలో మిషన్ భగీరథ కనెక్షన్లను ఎమ్మెల్యే ప్రారంభించారు.

పాశమైలారంలో భారీ అగ్ని ప్రమాదం

- ట్యాంకర్ నుంచి వ్యర్థాలు అన్‌లోడ్ చేస్తుండగా మంటలు
- ఎన్విరో వేస్ట్ మేనేజ్‌మెంట్ పరిశ్రమలో ఘటన

పటాన్‌చెరు రూరల్, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లా పాశమైలారంలోని సిగాచి పరిశ్రమలో జరిగిన అగ్ని ప్రమాద ఘటన మరువకముందే.. ఎన్విరో వేస్ట్ మేనేజ్‌మెంట్ అనే పరిశ్రమలో భారీ ప్రమాదం చోటు చేసుకున్నది. పరిశ్రమ లోపల ట్యాంకర్ నుంచి అన్‌లోడ్ చేస్తుండగా.. ట్యాంకర్ వెనక నుంచి అకస్మాత్తుగా మంటలు వచ్చాయి. అప్రమత్తమైన సిబ్బందితో పాటు డ్రైవర్ సహా ట్యాంకర్‌లో ఉన్న ఐదుగురు బయటకు పరుగులు తీయడంలో ప్రమాదం తప్పింది. ఘటన విషయం తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని ఐదు ఫైరింజన్లతో మంటలను అదుపులోకి తెచ్చారు. అప్పటికే అక్కడే ఉన్న లారీ, ఎక్స్‌కవేటర్ మంటలకు దగ్ధమయ్యాయి. ప్రమాదానికి కారణం షార్ట్‌సర్క్యూట్ అని యాజమాన్యం చెబుతోంది. వివిధ పరిశ్రమలకు చెందిన వ్యర్థ జలాలు, పదార్థాలను ఇక్కడ రీ ప్రాసెస్ చేసే క్రమంలో ఈ ప్రమాదం చోటు చేసుకున్నట్లు సమాచారం. అదృష్టవశాత్తు ఎవరూ గాయపడకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. సిగాచి ఘటన మరువని అగ్నిమాపక శాఖ కూడా ప్రమాద విషయం తెలుసుకున్న వెంటనే ఐదు ఫైరింజన్లను రంగంలోకి దింపడం గమనార్హం.



మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

అసలే గుంతల రోడ్డు.. ఆపై మూలమలుపులు

- గుంతలతో ప్రమాదకరంగా నాగిరెడ్డిపల్లి - వర్గల్ రహదారి
- నిత్యం పరిశ్రమల భారీ వాహనాలతో రద్దీ
- మూలమలుపుల వద్ద ఏపుగా చెట్ల కొమ్మలతో వాహనదారులకు ఇక్కట్లు
- రద్దీకి అనుగుణంగా రోడ్డును విస్తరించాలని స్థానికుల విజ్ఞప్తి




మూలమలుపు వద్ద రోడ్డుపై ప్రమాదకరంగా గుంతలు, రోడ్డుపైకి అడ్డువస్తున్న చెట్ల కొమ్మలు

ములుగు, జూలై 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రధాన రోడ్డుపై గుంతలు, మూల మలుపులు, దారికి అడ్డంగా పెరిగిన చెట్ల కొమ్మలు వెరసి వాహనదారుల పాలిట ప్రమాదకరంగా మారాయి. వివరాల్లోకి వెళ్తే.. మండలంలో ప్రధాన రోడ్డుకు ఇరువైపులా హరితహారంలో భాగంగా నాటిన మొక్కలు నేడు ఏపుగా పెరిగి పెద్ద చెట్లుగా మారాయి. వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఇదీ చాలదన్నట్టు గుంతలమయమైన రోడ్డుతో వారి కష్టాలు రెట్టింపయ్యాయి. ఏ మాత్రం ఆదమరిచినా ప్రమాదాల బారిన పడుతున్నారు. మూల మలుపుల వద్ద వీటి కారణంగా ఎదురుగా వచ్చే వాహనాలు కనబడక ప్రమాదాల బారిన పడుతున్నామని వాహనదారులు వాపోతున్నారు.

గుంతలమయంగా నాగిరెడ్డిపల్లి- వర్గల్ రోడ్డు

దాదాపు 8 ఏళ్ల క్రితం గత బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో మండలంలోని నాగిరెడ్డిపల్లి నుంచి వర్గల్ వెళ్లే దారిలో రోడ్డు వేశారు. పరిశ్రమల ఏర్పాటుతో ప్రతి రోజూ వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుండటంతో రోడ్డంతా గుంతలమయంగా మారింది. ముఖ్యంగా పరిశ్రమలకు వచ్చే వాహనాలతో పాటు పరిశ్రమలలో ఉత్పత్తి అయిన పరికరాలు తీసుకెళ్లడానికి వచ్చే భారీ వాహనాలతో రోడ్డు పూర్తిగా పాడయ్యింది. దీంతో పాటు వంటిమామిడి లక్ష్మక్కపల్లిలో ఆర్వీఎం ఆస్పత్రి ఉండడం వల్ల వాహనాల రద్దీ మరింత పెరిగింది. ఈ ఆసుపత్రికి తూప్రాన్ , మెదక్, రామాయంపేట్ కామారెడ్డి నుంచి రోగులు రావాలంటే ఇదే ప్రధాన రోడ్డు. ఈ కారణంగా నాగిరెడ్డిపల్లి నుంచి వర్గల్ వరకు రోడ్డు బాగా దెబ్బతిని గుంతలమయమై వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

పొరుగు మండలాల్లో పరిశ్రమలతో పెరిగిన రద్దీ

ములుగు మండల కేంద్రం రాజీవ్ రహదారి నుంచి మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలంలోని దండుపల్లిలోని 44వ జాతీయ రహదారిని కలుపుతూ 20 కిలోమీటర్ల రహదారిని ఏర్పాటు చేశారు. మనోహరాబాద్, వర్గల్, ములుగు మండలాల్లో పలు పరిశ్రమలు ఉన్నాయి. దీంతో వాహనాల రాకపోకలు పెరిగాయి. చెట్ల కొమ్మల కారణంగా మూలమలుపులు ప్రమాదకరంగా తయారయ్యాయి. దీంతో మూలమలుపుల వద్ద ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. అధికారులు ఈ సమస్యపై దృష్టి సారించి రోడ్డుకు అడ్డంగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు. ప్రమాదాల నివారణకు తక్షణమే సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని అదేవిధంగా వాహనాల రద్దీకి అనుగుణంగా రోడ్డును విస్తరించాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

రోడ్డును విస్తరించాలి



వర్గల్ మండలంలో పరిశ్రమలు రావడంతో ములుగు, దండుపల్లి రోడ్డుపై వాహనాల రద్దీ పెరిగిపోయింది. పెరిగిన వాహనాల రద్దీని దృష్టిలో ఉంచుకొని ఈ రోడ్డును విస్తరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. రోడ్డును నాలుగు లైన్ల రోడ్డుగా మార్చి వాహనదారుల ఇబ్బందులను తొలగించాలి.

- కడపల నరేందర్‌రెడ్డి, ములుగు

పాలకులు పట్టించుకోకపోతేనేం...
రోడ్డు బాగుకు గ్రామస్థులే నడుం బిగించారు



రోడ్డుకు ఇరువైపులా చెట్ల కొమ్మలను తొలగిస్తున్న గ్రామస్థులు

కొండపాక, జూలై 13 (ఆంధ్రజ్యోతి): కొండపాక మండలం ఖమ్మం పల్లి గ్రామానికి వెళ్లే రహదారి రోడ్డు కిరువైపులా ఉన్న చెట్ల కొమ్మలతో మూసుకుపోయింది. రోడ్డంతా గుంతల మయంగా తయారైంది. సమస్యను అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడంతో విసిగిపోయిన గ్రామస్థులు తామే రోడ్డును బాగుకోసం నడుం బిగించారు. వివరాల్లోకి వెళ్తే.. సిద్దిపేట జిల్లా కేంద్రానికి 8 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఖమ్మంపల్లి గ్రామం సిద్దిపేట కలెక్టర్ కార్యాలయానికి 10 కిలోమీటర్ల దూరంలో ఉంది. సిద్దిపేట నుంచి ఎన్సాన్‌పల్లి మీదుగా ఖమ్మంపల్లికి వెళ్లే రహదారి అస్తవ్యస్తంగా తయారైంది. అటు మర్పడగ నుంచి ఖమ్మంపల్లికి వెళ్లే దారి సైతం పూర్తిగా చెడిపోయి వాహనాలు వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. ఇటు మర్పడగ వైపు నుంచి సిద్దిపేటకు అటు ఎన్సాన్‌పల్లి మీదుగా సిద్దిపేట వైపు వెళ్లే రెండు రహదారులు చెడిపోవడంతో గ్రామ ప్రజల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఆర్టీసీ బస్సు లేదా అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్స్ రావాలన్నా తీవ్ర ఇబ్బందులెదురవుతున్నాయని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో కొందరు గ్రామస్థులు రోడ్డును తామే బాగు చేసే ఆలోచన చేశారు. అనుకున్నదే తడవుగా కొంతమంది ఖర్చుల నిమిత్తం డబ్బు ఇచ్చేందుకు ముందుకొచ్చారు. మరికొంతమంది స్వయంగా పని చేసేందుకు నడుం బిగించారు. ఈ మేరకు రోడ్డుపై అడ్డంగా పెరిగిన చెట్ల కొమ్మలు తొలగించే కార్యక్రమాన్ని ఆదివారం చేపట్టారు. కమ్మంపల్లి నుంచి సిద్దిపేట వైపు వెళ్లే రహదారికి ఇరువైపులా చెట్ల కొమ్మలు తొలగించారు. పెద్దపెద్ద చెట్ల కొమ్మల కోసం ఎక్స్‌కవేటర్‌ను ఉపయోగించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు తమ గ్రామాన్ని పట్టించుకోవడంలేదని పలువురు వాపోయారు. ఇకనైనా తమ గ్రామానికి రెండు వైపుల నుంచి రోడ్డుబాగు చేయించాలని కోరుతున్నారు.

శాకంబరిగా వాసవీ కన్యకాపరమేశ్వరీదేవి




శాకంబరి అలంకరణలో అమ్మవారు.. దర్శించుకుంటున్న ఆర్యవైశ్య సంఘం మహిళలు

దుబ్బాక, జూలై 13 (ఆంధ్రజ్యోతి): దుబ్బాక పట్టణంలోని ఆర్యవైశ్యభవనంలో ఆదివారం వాసవీ కన్యకాపరమేశ్వరీమాతను శాకంబరిదేవి అలంకారంలో భక్తులు దర్శించుకున్నారు. పట్టణంలోని ఆర్యవైశ్యమహిళాసంఘం ఆధ్వర్యంలో ఆషాఢమాసాన్ని పురస్కరించుకుని మహిళలు గోరింటాకు పండుగను చేసుకున్నారు. అమ్మవారి సమక్షంలో రోకలితో గోరింటాకును ముద్దగా దంచారు. అనంతరం దాన్ని మహిళలు చేతులకు అందంగా అలంకరించుకున్నారు. వాసవీకన్యకాపరమేశ్వరీదేవిని వివిధ రకాల కూరగాయలో అలంకరించారు. శాకాంబరిగా వెలిసిన వాసవీ మాతకు పట్టణ పురోహితులు వేలేటి జయరామశర్మ, రామకృష్ణ శర్మ తదితరులు సంప్రదాయబద్ధంగా వైదిక కార్యక్రమాలను నిర్వహించారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలి: బీఆర్ఎస్



ముస్త్యాలలో జరిగిన సన్నాహక సమావేశంలో నినాదాలు చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

చేర్యాల, జూలై 13(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో గులాబీ సత్తా చాటాలని బీఆర్ఎస్ మండల క్లస్టర్ ఇన్‌చార్జి మంగోలు చంటి, యూత్ ఇన్‌చార్జి శివగారి అంజయ్య పేర్కొన్నారు. చేర్యాల మండలం ముస్త్యాల, చుంచనకోట, వీరన్నపేట గ్రామాల్లో ఆదివారం పార్టీ సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అసమర్థ పాలనతో రాష్ట్రం అన్నిరంగాల్లో వెనకంజకు గురైందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలకు కార్యకర్తలు సంసిద్ధంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ వుల్లంపల్లి కరుణాకర్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సుంకరి మల్లేశం, సర్పంచులఫోరం మాజీ అధ్యక్షుడు పెడుతల ఎల్లారెడ్డి, అతార్, ఒగ్గు శ్రీశైలం, వడ్లకొండ శ్రీనివాస్, సాతెల్లి జగన్, కొంగరి గిరిధర్, మీస రవితేజ, తదితరులు పాల్గొన్నారు.

● **మద్దూరు:** స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో కార్యకర్తలు సన్నద్ధం కావాలని బీఆర్ఎస్ ఇన్‌చార్జి ముత్యాల నాగేశ్వర్‌రావు పిలుపునిచ్చారు. ఆదివారం మండలంలోని లద్నూరు, ధర్మారం, సలాఖ్‌పూర్ గ్రామాల్లో మండల పార్టీ అధ్యక్షుడు మేక సంతోష్ అధ్యక్షతన స్థానిక సంస్థలపై సన్నాహక సమావేశం నిర్వహించగా, నాగేశ్వర్‌రావు పాల్గొని మాట్లాడారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కార్యకర్తల, నాయకులు పార్టీ అభ్యర్థులను గెలిపించుకోవాలన్నారు. కార్యక్రమంలో సొసైటీ వైస్ చైర్మన్ ఇర్రి రాజిరెడ్డి, మాజీ ఎంపీపీ బద్దిపడిగె కృష్ణారెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ మలిపెద్ది సుమలతమల్లేశం, పలువురు గ్రామ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

చెట్లకొమ్మల్లో ప్రమాదకరంగా విద్యుత్‌తీగలు



మద్దూరు, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ సరఫరాలో అంతరాయాన్ని తొలగించేందుకు విద్యుత్ లైన్ల కింద ఏపుగా పెరిగిన చెట్లను తొలగిస్తున్న విషయం తెలిసిందే. అయితే కొన్ని చోట్ల చెట్ల కొమ్మలకు విద్యుత్‌వైర్లు ప్రమాదకరంగా అతుక్కుపోయినా తమకు ఏమాత్రం సంబంధం లేనట్టుగా వ్యహరిస్తున్న విద్యుత్ సిబ్బందిపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మద్దూరు మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రం గేటు ముందర గల చెట్టు కొమ్మలకు విద్యుత్ తీగలు అతుక్కుపోయి ఉన్నాయి. ఈ విషయమై విద్యుత్ సిబ్బందికి పలుమార్లు తెలిపినా తమకు పట్టింపు లేనట్లుగా వ్యవహరిస్తున్నారు. ఇటీవల విద్యుత్ సిబ్బంది నిర్లక్ష్యంతో మండల కేంద్రంలో తరచూ విద్యుత్ అంతరాయాలు నెలకొంటుండటంతో వినియోగదారులు మండిపడుతున్నారు. విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా చూడాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

మద్రాస్ ఐఐటీతో దామరకుంట జడ్పీ ఉన్నత పాఠశాల ఎంవోయూ



విద్యార్థులతో ఎంఈవో వెంకటరాములు

మర్కుక్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): ఐఐటీ మద్రాస్ యూనివర్సిటీతో మర్కుక్ మండల పరిధిలోని జడ్పీ ఉన్నత పాఠశాల దామరకుంట ఒప్పందం(ఎంవోయూ) కుదుర్చుకోవడం అభినందనీయమని ఎంఈవో వెంకటరాములు పేర్కొన్నారు. ఆదివారం ప్రధానోపాధ్యాయుడు వెంకట్రాములుకు ఈ మెయిల్ ద్వారా ఎంవోయూను ధ్రువీకరించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ చురుకైన పిల్లలకు ఆన్‌లైన్ ద్వారా డాటాసైన్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ తదితర కోర్సుల్లో ఉచితంగా శిక్షణ ఇస్తారని తెలిపారు.

కాంగ్రెస్‌తోనే సామాజిక న్యాయం



చిన్నకోడూరులో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రుల ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

చిన్నకోడూరు, జూలై 13 (ఆంధ్రజ్యోతి): సామాజిక న్యాయం కాంగ్రెస్‌తోనే సాధ్యమవుతుందని డీసీసీ ప్రధాన కార్యదర్శి మీసం నాగరాజు యాదవ్ పేర్కొన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్‌లను మంత్రి వర్గం ఆమోదించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ ఆదివారం చిన్నకోడూరులో కాంగ్రెస్ నాయకులు సీఎం రేవంత్ రెడ్డి, మంత్రుల ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బత్తిని గణేష్ గౌడ్, నరసింహులు, చంద్రశేఖర్, సంపత్, శేఖర్, వెంకట్, రాజు, నాగరాజు, స్వామి, బాబు, దేవయ్య, రాజు, శేఖర్, మల్లేశం, నవీన్, రాజు, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాన్ని వేగవంతం చేయాలి

మద్దూరు, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : ఇందిరమ్మ లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాల్ని వేగవంతంగా చేపట్టాలని కాంగ్రెస్ దూళిమిట్ట మండల అధ్యక్షుడు కోల సాయిలుగౌడ్ తెలిపారు. ఆదివారం మండలంలోని కొండాపూర్‌లో పలు ఇందిరమ్మ ఇళ్ల పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ రాజు, ఉపాధ్యక్షుడు మంద శ్రీనివాస్, గ్రామశాఖ అధ్యక్షుడు రాజు, సాగర్‌గౌడ్, మాజీ సర్పంచ్ పద్మనీలయ్య తదితరులు పాల్గొన్నారు.

ఐక్యపోరాటలకు సిద్ధం కావాలి

మద్దూరు, జూలై 13 (ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ కార్మికులు పోరాడి సాధించుకున్న సంక్షేమ బోర్డు రక్షణకై నిర్మాణ రంగ కార్మికులు ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని బిల్డింగ్ అండ్ అదర్ కన్‌స్ట్రక్షన్ వర్కర్ యూనియన్ సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి చొప్పరి రవికుమార్ పిలుపునిచ్చారు. ఆదివారం దూళిమిట్టమండల కేంద్రంలో బండారు గట్టయ్య అధ్యక్షతన నిర్వహించిన మండల ద్వితీయ మహాసభలో పాల్గొని మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వం కార్మిక వర్గానికి నష్టం వాటిల్లే చట్టాలు తీసుకువస్తుందన్నారు. అనంతరం మండల కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా దువ్వెన యాదయ్య, కార్యదర్శిగా బండారి గట్టయ్య, కోశాధికారిగా చొప్పరి రాజు, ఉపాధ్యక్షులుగా బాషబోయిన సత్తయ్య, గండిపల్లి స్వామి, కొలిపాక కనక స్వామి, సహాయ కార్యదర్శిగా బూక్య గోపాల్, పాలేటి రాజశేఖర్ ఎన్నికయ్యారు.

వాలీబాల్ విజేతలకు బహుమతుల ప్రదానం



విజేతలకు బహుమతులు అందజేస్తున్న సంతోష్

గజ్వేల్ రూరల్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): గజ్వేల్‌లోని వాలీబాల్ అసోసియేషన్ ఫిట్నెస్ గ్రూప్ అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో గత రెండు రోజులుగా నిర్వహిస్తున్న వాలీబాల్ పోటీలు ముగిశాయి. ఆదివారం విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. విజేతగా ఆర్‌అండ్‌ఆర్ కాలనీ టీమ్, రన్నర్ ఎగా అహ్మదీపూర్ టీమ్, థర్డ్ ప్లేస్‌లో సెయింట్ జోసెఫ్ టీమ్స్ నిలిచాయి. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ఎన్సీ సంతోష్ హరి, రఘుపతి సభ్యులు పాల్గొన్నారు.

రేణుకాదేవిని దర్శించుకున్న జిల్లా న్యాయమూర్తి



పెద్దగుండవెల్లిలో రేణుకాదేవికి పూజలు నిర్వహిస్తున్న జిల్లాజడ్జి సాయిరమాదేవి

దుబ్బాక, జూలై13(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్ద గుండవెల్లి గ్రామ రేణుకాదేవి ఎల్లమ్మ ఆలయాన్ని ఆదివారం సిద్దిపేట జిల్లా న్యాయమూర్తి సాయిరమాదేవి సందర్శించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆషాఢమాసాన్ని పురస్కరించుకుని ఆలయంలో అమ్మవారికి ఓడిబియ్యం సమర్పించారు. ఆమెతో జిల్లా సీనియర్ జడ్జి సంతోష్‌కుమార్, ఆలయ చైర్మన్ ఎల్ల్పుల మహేష్ తదితరులున్నారు.

ఎన్నికల సాకుతో గొడవ వద్దు



రాయపోల్‌లో గ్రామస్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ మానస

రాయపోల్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలని రాయపోల్ ఎస్ఐ మానస సూచించారు. ఆదివారం రాయపోల్‌లో గ్రామ పోలీసు అధికారులతో కలిసి ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రజలందరూ కలిసిమెలిసి ఉండాలని, ఎన్నికలను అడ్డం పెట్టుకొని గొడవలకు దిగవద్దని హెచ్చరించారు. నేరాల నియంత్రణకు దోహదపడే సీసీ కెమెరాలను ఏర్పాటుకు అందరూ సహకరించాలని కోరారు.

సంపూర్ణ ఆరోగ్యం కోసం పరిశుభ్రత అవసరం

దౌల్తాబాద్,జూలై 13 (ఆంధ్రజ్యోతి): గ్రామాలలో ప్రతీ ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని దౌల్తాబాద్ ఎస్ఐ గంగధర అరుణ్‌కుమార్ సూచించారు. ఆదివారం దౌల్తాబాద్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఎస్ఐ అరుణ్‌కుమార్ సిబ్బందితో కలిసి పిచ్చి మొక్కలను, గడ్డిని తొలగించారు. ఈ సందర్భంగా ఎస్ఐ అరుణ్‌కుమార్ మాట్లాడుతూ. వర్షకాలం దృష్ట్యా చెత్తచెదారం, పిచ్చి మొక్కలను ఎప్పటికప్పుడు తొలగించుకుంటూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలకు సూచించారు. అదే విధంగా ఆదివారం మండలకేంద్రంలోని అంగడి జరిగే ప్రదేశం శివాజీచౌరస్తాలో ప్రజలకు సైబర్ నేరాలు, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ శేషం రాజు,కానిస్టేబుల్ స్వామి,సాయి,సతీష్,నాగరాజు,పరుశురాం, మనోజ్,తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీలకు 18శాతం రిజర్వేషన్ పెంచాలి



మంత్రి సీతక్కకు వినతిపత్రాన్ని అందజేస్తున్న బక్కివెంకటయ్య

మిరుదొడ్డి, జూలై13(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికలకంటే ముందే ఎస్సీలకు దామాషా ప్రకారం 18శాతం రిజర్వేషన్‌ను పెంచాలని రాష్ట్ర ఎస్సీఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కివెంకటయ్య ఆదివారం రాష్ట్ర మంత్రి సీతక్కను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం చారిత్రాత్మకంగా కులగణను చేపట్టి బీసీలకు 42 శాతం రిజర్వేషన్‌కు ఆర్డినెన్స్‌ను తీసుకొనివస్తుందన్నారు. అదే ప్రకారం రాష్ట్రంలో పెరిగిన ఎస్సీల జనాభాకు అనుగుణంగా ఎస్సీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 18శాతం రిజర్వేషన్ కల్పించాలని ఆయన కోరారు.

విద్యార్థుల వ్యక్తిత్వాన్ని పెంచేలా బోధనలు ఉండాలి

సిద్దిపేట అర్బన్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు బోధించే సమయంలో వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందించేలా బోధిస్తే జీవన విధానంలో వారికి ఈ పద్ధతి ఎంతగానో ఉపయోగపడుతుందని వికాస్ హై స్కూల్ సీబీఎస్ఈ ప్రిన్సిపాల్ డాక్టర్ ఉమా పేర్కొన్నారు. ఆదివారం స్థానిక పాఠశాలలో వ్యూహం మార్గదర్శకాలు, కెపాసిటీ, బిల్డింగ్ కార్యక్రమాన్ని నిర్వహించి ఉపాధ్యాయులకు, విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులు అనుకున్న లక్ష్యం నెరవేరాలంటే ప్రణాళికతో చదివి భవిష్యత్తులో ముందుకు సాగాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

గజ్వేల్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేసి వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటుదామని గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సర్దార్ ఖాన్ పేర్కొన్నారు. గజ్వేల్‌లో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలుకు చర్యలు తీసుకోవడం మంచి పరిణామమని అన్నారు. వెంట నాయకులు పాల్గొన్నారు.

వీహెచ్‌పీఎస్ సదస్సును విజయవంతం చేయాలి



కోహెడలో సమావేశమైన దివ్యాంగులు

కోహెడ, జూలై 13 (ఆంధ్రజ్యోతి): కోహెడ మండల కేంద్రంలో దివ్యాంగుల సమస్యలపై ఆదివారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సమావేశంలో నియోజకవర్గ ఇన్‌చార్జి మాట్ల వెంకటస్వామి మాట్లాడుతూ.. జూలై 16 న సిద్దిపేట జిల్లా కేంద్రంలో జరిగే వీహెచ్‌పీఎస్ సదస్సును విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. దివ్యాంగుల పెన్షన్ రూ.4వేల నుంచి 6 వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. స్థానిక సంస్థల ఎలక్షన్లలో 5 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తూ ఆర్డినెన్స్ తీసుకు రావాలని కోరారు. ఆర్టీసీలో ఉచితంగా ప్రయాణ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేస్తూ ఆగస్టు 13న చలో ఎల్బీ స్టేడియం దివ్యాంగుల గర్జనను లక్షలాది మందితో నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో వీహెచ్‌పీఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మాయాగ్నోస్టిక్‌లు

(5వ పేజీ తరువాయి)

పలువురు సిబ్బందితో, కొందరు డాక్టర్లతో ల్యాబ్ నిర్వాహకులు సన్నిహితంగా ఉంటున్నారు. డాక్టర్లకు కమీషన్లు ఇస్తూ, రోగులను తమ ల్యాబ్‌లకు పంపించుకునేలా చేస్తున్నారు. చిన్నపాటి జ్వరంతో బాధపడుతూ డాక్టర్ దగ్గరకు వెళ్తే చాలు, నాడి పట్టకుండానే బీపీ, షుగర్, మూత్ర పరీక్ష చేయించుకుని రావాలని సూచిస్తున్నారు. చిన్న ఆసుపత్రులకు పరీక్షల కోసం రూ.1000 నుంచి రూ.2000 వరకు వసూలు చేస్తుంటే, పెద్ద ఆసుపత్రులు రూ.5వేలకు పైగా బిల్లులు చేతిలో పెడితే గానీ రిపోర్టులు ఇవ్వడం లేదు. పరీక్షలు చేసి డబ్బులు తీసుకున్నా, చాలామంది బిల్లులు ఇవ్వడం లేదు. బిల్లులు ఇవ్వకున్నా వాటికి డబ్బులు కట్టి డాక్టర్‌కు చూపించాక, పరీక్షల్లో ఏమీలేదు, చిన్నపాటి జ్వరమే అనే సమాధానం వస్తోంది.

ఫీజుల బోర్డులు లేవు

ఏ డయాగ్నోస్టిక్ సెంటర్‌లోనూ ఏ వైద్య పరీక్షకు ఎంత ఫీజు వసూలు చేస్తున్నారో తెలిపే ఫీజుల సూచిక బోర్డులు ఎక్కడా కనిపించడం లేదు. దీని వల్ల వారు ఎంత అడిగితే అంత ఇవ్వవలసి వస్తుందని ప్రజలు వాపోతున్నారు. డయాగ్నోస్టిక్ సెంటర్లు చేస్తున్న ఈ దోపిడీని ప్రజలు అధికారులకు తెలియజేస్తున్నా, లిఖితపూర్వకంగా ఇస్తేనే చర్యలు తీసుకుంటామని పేర్కొంటున్నారే తప్ప చర్యలు మాత్రం చేపట్టడం లేదనే విమర్శలున్నాయి. డయాగ్నోస్టిక్ సెంటర్లపై తనిఖీలు చేపట్టాల్సిన వైద్య ఆరోగ్యశాఖ అధికారులు కొన్నేళ్లుగా నిర్లక్ష్యంగా వ్యవహరించడం ఈ అక్రమాలకు ప్రధాన కారణం. రాజకీయ, అధికార అండదండలతో రెచ్చిపోతున్నారు. 'జిల్లా ఉన్నతాధికారి మావాడే.. మమ్మల్ని ఏం చేయలేరు' అని ల్యాబ్‌ల నిర్వాహకులు బాహాటంగానే మాట్లాడుతున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి, డయాగ్నోస్టిక్ సెంటర్లలో జరుగుతున్న దోపిడీకి అడ్డుకట్ట వేయాలని ప్రజలు కోరుతున్నారు.

న్యూస్ బాక్స్

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



లబ్దిదారుకు చెక్కు అందజేస్తున్న జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి

చేర్యాల, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : చేర్యాల మండలానికి చెందిన ఆరుగురికి సీఎంఆర్ఎఫ్ కింద ఆర్థికసాయం మంజూరైంది. లబ్ధిదారులకు జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి ఆదివారం పట్టణంలోని తన నివాసంలో సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ మేరకు మొత్తం రూ.2.37 లక్షల విలువ చేసే చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు కొమ్ము రవి, పట్టణాధ్యక్షుడు దాసరి శ్రీకాంత్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

● **కొండపాక:** మండలంలోని దుద్దెడకు చెందిన ముగ్గురికి సీఎంఆర్ఎఫ్ కింద మంజూరైన ఆర్థికసాయం చెక్కులను బీఆర్ఎస్ నాయకులు ఆదివారం అందజేశారు. ఈ మేరకు మొత్తం రూ. 1,29,500 విలువ చేసే చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ అధ్యక్షుడు నూనె కుమార్, మాజీ సర్పంచ్ పెద్దంకుల శ్రీనివాస్‌గౌడ్, యూత్ అధ్యక్షులు చిక్కుడు భాను తదితరులున్నారు.

ఆర్థిక సాయం

గజ్వేల్ రూరల్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): గజ్వేల్ మండల పరిధిలోని రిమ్మనగూడ గ్రామానికి చెందిన తిర్రి కనకవ్వ అనారోగ్యంతో మృతి చెందింది. బీజేపీ గ్రామ అధ్యక్షుడు గుండారం నవీన్‌కుమార్ బాధిత కుటుంబాన్ని పరామర్శించి తన వంతు సాయంగా రూ.5వేలు అందజేశారు.

బైరాన్‌పల్లి ఉన్నత పాఠశాలకు సౌండ్ సిస్టమ్ బహూకరణ

మద్దూరు, జూలై 13 (ఆంధ్రజ్యోతి): దూళిమిట్ట మండలం బైరాన్‌పల్లి ఉన్నత పాఠశాలకు గ్రామానికి చెందిన రామిని వీరేశం రూ. 20 వేల విలువ చేసే సౌండ్ సిస్టమ్‌ను బహూకరించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రామాంజనేయులు రామిని వీరేశానికి పాఠశాల తరపున కృతజ్ఞతలు తెలియజేశారు.

నిత్యావసర సరకులు అందజేత

మర్కుక్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): డొనేషన్ దూ ఫర్ నేషన్ అనే స్వచ్ఛంద సంస్థ సహకారంతో మర్కుక్ మండలంలోని ఎర్రవల్లి గ్రామంలో నిరుపేద వృద్ధురాలు రాజవ్వకు ఆదివారం నిత్యావసర సరుకులను అందజేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ సభ్యులు మాట్లాడుతూ వృద్ధురాలైన రాజవ్వ భర్త, కుమారుడు, కోడలు చనిపోవడంతో ఇద్దరు పిల్లలను అతి కష్టంతో పోషిస్తూ జీవనం కొనసాగిస్తుందన్నారు. ఈ విషయాన్ని తెలుసుకున్న డొనేషన్ సంస్థ సభ్యురాలు అనురాధ పుట్టినరోజు సందర్భంగా 30 కేజీల బియ్యం, కిరాణా సరుకులు అందజేసి ఉదారతను చాటుకున్నారు.

ఇంటి లబ్ధిదారులకు యువకుడి చేయూత



లబ్ధిదారుకు సిమెంట్ బస్తాలను అందజేస్తున్న వెంకటేశ్

బెజ్జంకి, జూలై 13 (ఆంధ్రజ్యోతి): తన కూతురు పుట్టిన రోజు సందర్భంగా ఓ యువకుడు పలువురు ఇందిరమ్మ లబ్ధిదారులకు సిమెంట్ బస్తాలను పంపిణీ చేసి చేయూతనందించాడు. బెజ్జంకి మండల కేంద్రానికి చెందిన లింగాల వెంకటేశ్ కూతురు విభ పుట్టిన రోజు సందర్భంగా గ్రామంలోని 15 మంది ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ఒక్కొక్కరికి 15 సిమెంట్ బ్యాగులు పంపిణీ చేశారు. స్లాబ్ వేసే సమయంలో ఒక్కో ఇంటికి మరో 35 బ్యాగ్‌లను అందిస్తానని వెంకటేశ్ తెలిపారు. ఈ సందర్భంగా వెంకటేశ్‌ను పలువురు అభినందించారు.